ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 12-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- భారత 15వ ఉప రాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- పురాతన కాలం నాటి విజ్ఞానం జ్ఞాన్ భారతం మిషన్ ద్వారా డిజిటలైజ్ చేయబడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- దేశంలోని ప్రతి వీధి క్రీడారంగం కావాలని కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఆకాంక్షించారు.
- స్వావలంబన భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

==============================

భారత 15వ ఉప రాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, పూర్వ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జె.పి. నడ్డా, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. నూతన ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడని, ఆయన తన జీవితాన్ని జాతి నిర్మాణం, సామాజిక సేవకు అంకితం చేశారని కొనియాడారు. ప్రజాసేవకు అంకితమై, ఉప రాష్ట్రపతి పదవిలో ఆయన విజయవంతంగా కొనసాగాలని నరేంద్రమోదీ ఆకాంక్షించారు.

==============================

పురాతన కాలం నాటి విజ్ఞానం జ్ఞాన్ భారతం మిషన్ ద్వారా డిజిటలైజ్ చేయబడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జ్ఞాన్ భారతం అంతర్జాతీయ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతదేశ చింతన, ఆచార్యుల బోధనలు, మన శాస్త్రీయ జ్ఞాన సంప్రదాయాలు విలువైన జ్ఞాన సంపద అని పేర్కొన్నారు. విజ్ఞాన్ భవన్ భారతదేశ స్వర్ణ గత పునరుజ్జీవనాన్ని చూస్తోందని చెప్పారు. తక్కువ సమయంలోనే జ్ఞాన్ భారతం మిషన్ అంతర్జాతీయ సమావేశం, పోర్టల్ ప్రారంభం జరిగాయని చెప్పారు. ఇది భారతదేశ సంస్కృతి, సాహిత్యం, చైతన్యాన్ని వెల్లడించబోతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...40 సెకన్లు)

==============================

దేశంలోని ప్రతి వీధి క్రీడారంగం కావాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిన క్రీడా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. క్రీడలను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో క్రీడలలో

అగ్రస్థానంలో ఉన్న తొలి ఐదు దేశాలలో భారత్‌ను ఒకటిగా నిలపాలన్నదే తమ ఉద్దేశ్యమన్న ఆయన.. ప్రతి ఇంట్లో క్రీడా సంస్కృతిని నెలకొల్పాలని పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా పాలన చట్టం - 2025 ఒక మైలురాయి వంటిదిగా అభివర్ణించారు. ఈ చట్టం వివాదాల పరిష్కారానికి, నిర్ణయాత్మక సంస్థలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వావలంబన భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తోందని ఈరోజు ఆయన బీహార్‌లోని రాంచీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన తెలిపారు. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడంతో పాటు కీలకమైన ఖనిజాలను అందుబాటులోకి తీసుకురావడంలో బొగ్గు, ఖనిజ వనరులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. గత 11 సంవత్సరాలుగా, సుపరిపాలన, వ్యాపార సౌలభ్యత, స్థిరమైన ఆర్థిక పురోగతి లక్ష్యంగా మంత్రిత్వ శాఖ నిరంతరం సంస్కరణలను అమలు చేస్తోందన్నారు. కోల్ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులు, మైనింగ్ కార్మికుల అభ్యున్నతి కోసం కేంద్ర మంత్రి 3 కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రకటించారు. మైనింగ్ రంగంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టడం ద్వారా అక్రమ మైనింగ్ వంటి సంఘటనలను హేతుబద్ధీకరించడానికి మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రామ్ రామ్ గూలం ఈరోజు అయోధ్యలోని శ్రీ రాంలల్లా ఆలయాన్ని సందర్శించారు. తొలుత అయోధ్య చేరుకున్న ఆయనకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, వ్యవసాయ మంత్రి సూర్య ప్రతాప్ షాహి.. మహర్షి వాల్మీకి విమానాశ్రయంలో సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. డాక్టర్ నవీన్ చంద్ర రామ్ గూలం.. రామాలయంలో ఆరతి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుండి డెహ్రాడూన్‌కు పయనమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు పోషకాహారం పునాది అని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాస్‌నాథ్ అన్నారు. ఈరోజు ఆయన పుదుచ్చేరిలో 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ ను ప్రారంభించారు. ఈ సంవత్సరం పోషకాహార మాసం ఇతివృత్తాన్ని తెలియజేస్తూ.. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి చక్కెర, ఉప్పు, నూనె వంటివి తగ్గించాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని, అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు సర్టిఫికెట్లు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎన్. రంగాస్వామి, పుదుచ్చేరి శాసనసభ స్పీకర్ ఆర్. సెల్వం, తదితరులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురవచ్చని భారత వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. తెలంగాణా, మహారాష్ట్ర ల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ నెల 13 నుండి 15వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 15 నుండి రాజస్థాన్ ప్రాంతం నుండి నైరుతి రుతుపవనాలు తిరోగమించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బైరాబి-సైరంగ్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టు మిజోరం ప్రజల జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మిజోరం పర్యటన సందర్భంగా ఈరోజు ఆయన సైరంగ్ రైల్వేస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. 45 సొరంగాలు, 55 వంతెనలు ఉండడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు కష్టతరమైనవని అన్నారు. ఈశాన్య ప్రాంతంలోని రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులను 2014 తరువాత నరేంద్రమోదీ

సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఐదు రెట్లు పెంచిందని అన్నారు. మిజోరం పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఈ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టును ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే.. 3 ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని భారతదేశం, ఫ్రాన్స్ ఖండించాయి. ఉగ్రవాద సవాళ్ళపై భారత్, ఫ్రాన్స్ దేశాల సంయుక్త కార్యాచరణ బృందం (JWG) అంచనా వేసిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్, ఫ్రాన్స్ దేశాల (JWG) 17వ సమావేశంలో ఇరు పక్షాలు ఉగ్రవాద ముప్పుపై తమ అభిప్రాయాలను తెలియజేసుకున్నాయని పేర్కొంది. అలాగే.. ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్రవాద కార్యకలాపాలు, పశ్చిమాసియాలో ఉగ్రవాద ముప్పు తదితర అంశాలపై చర్చించాయని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ముద్ర యోజన ఆమోద లేఖ అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న లేఖ నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిజ నిర్ధారణ విభాగం తెలిపింది. బీమా ఛార్జీలుగా 36 వేల 500 రూపాయలు చెల్లించిన తరువాత ప్రధానమంత్రి ముద్ర యోజన కింద 3 లక్షల రూపాయల రుణం మంజూరు చేస్తామని ఆ లేఖలో తప్పుడు హామీ ఉంది. అలాంటి అనుమతిని మంజూరు చేయలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =